# 2

# "ప్రభువా, కనికరించుము!"

## (1:12-22)

నా తల్లి భక్తిగల క్రైస్తవురాలు. శాపపు మాటగాని, శాపంగా వినిపించే గ్రామీణ పద ప్రయోగంగాని ఆమె ఉచ్చరించినట్టు నేనెన్నడు వినలేదు. చెడ్డ సమాచారం ఆమె విన్నా, లేక అసహ్యమైనవి చూచినా, "ప్రభువా కనికరించుము!" అని ఆమె తరచుగా అంటుంది.

దేవుని కనికరమునందు విశ్వసించి నేను పెరిగాను. కీర్తన రచయిత యిలా అన్నాడు: "యెహోవా దయాళుడు ఆయన కృప నిత్యముండును; ఆయన సత్యము తరతరము లుండును" (కీర్తన. 100:5). ప్రవక్తయైన మీకా యిలా తెలిపాడు,

> తన స్వాస్థ్యములో శేషించినవారి దోషమును పరిహరించి, వారు చేసిన అతిక్రమముల విషయమై వారిని క్షమించు దేవుడవైన నీతో సముడైన దేవుడున్నాడా? ఆయన కనికరము చూపుటయందు సంతోషించువాడు గనుక నిరంతరము కోపముంచడు. ఆయన మరల మనయందు జాలిపడును, మన దోషములను అణచివేయును, వారి పాపములన్నిటిని సముద్రపు అగాధములలో నీవు పడవేతువు (మీకా 7:18, 19).

కనికరము అంటే, ఎదురు చూడగలిగినంతకంటే మించిన "దయ" అని అర్థం. మన పాపముల నిమిత్తము పొందదగిన శిక్షను మనపై విధింపబడకుండ దేవుని కనికరము చేస్తుంది.

ఏదియెలాగున్నా, కొన్నిసార్లు, మన పాపం ఎంత గొప్పదంటే దేవుడు తన కని కరమును కొంతసేపు వెనుకకు తీసికొంటాడు. కీర్తన రచయిత యిలా అడుగుతున్నాడు,

> ప్రభువు నిత్యము విడనాడునా? ఆయన ఇకెన్నడును కటాక్షింపడా? ఆయన కృప ఎన్నటికి లేకుండ మానిపోయెనా? ఆయన సెలవిచ్చిన మాట తరతరములకు తప్పి పోయెనా? దేవుడు కటాక్షింప మానెనా? ఆయన కోపించి వాత్సల్యత చూప కుండునా? (కీర్తన. 77:7-9).

యూదా యొక్క పాపము ఎంతో ఘోరమైనది గనుక తాత్కాలికంగా దేవుడు దాని పోనిచ్చాడు. జనులు సహాయము కొరకును, ఆదరణకొరకును ఎదురు చూడగా, దేవుడు వారిని లక్ష్యపెట్టినట్టులేదు. యూదాయొక్క స్థితి భీతిని గొల్పెడిదిగా చిత్రించి, దేవుడు లేకుండా ఉంటే ఎలాగుంటుందో యిర్మీయా వర్ణించబూనాడు. "కన్యకయైన యూదా కుమారి"యని యెరూషలేమును అతడు వ్యక్తీకరించి మాట్లాడాడు (1:15). తన మాటలద్వారా, దేవుని కనికరముకొరకు అతడు వేడుకొని, దాని కేసును దేవుని యెదుట

పెట్టాడు. యెరూషలేమునకు కనికరము చూపించు అని అతడు దేవుని ఎందుకు వేడుకున్నాడు?

## ఆమె (దాని) దుఃఖాన్నిబట్టి

మహా వేదనతో కూడిన స్వరముతో కన్యకయైన యూదా కుమారి తన దుఃఖాన్ని వెల్లబుచ్చింది. ఆమె తిరస్కారాన్ని సహించుతుంది, ఎవరును లక్ష్యపెట్టేవారు గాని గమనించినవారు గాని లేని కారణాన అది అధికం చేయబడింది. "త్రోవను పోవు వారలారా, మీకు యిది ఏమియు లేనట్టు తోస్తుందా?" అని ఆమె అడుగుతుంది. తన దుఃఖమువంటి దుఃఖము మరి ఎవరికిని లేదు. దేవుడు తన ప్రచండమైన కోపముతో తనకు ఏమి చేసెనో దానిని చూడుడని త్రోవను పోవువారిని ఆమె కోరుకొంటుంది:

> పరమునుండి ఆయన నా యెముకల మీద అగ్ని ప్రయోగించియున్నాడు, అది యెడతెగక వాటిని కాల్చుచున్నది. నా పాదములను చిక్కుపరచుటకై వలనొగ్గియున్నాడు; నన్ను వెనుకకు త్రిప్పియున్నాడు; ఆయన నన్ను పాడుచేసి దినమెల్ల నన్ను సొమ్మసిల్లజేసి యున్నాడు (1:13).

కన్యకయైన యూదా కుమారి నిరీక్షణ లేనంతగా ఓడింపబడింది. తన ఎముకలలోని అగ్నిచేత ఆమె క్రుంగదీయబడింది. దేవుని వాక్యము తన ఎముకలలో మండుచు తన్ను ఎలా లోబరచుకుందో సూచించడానికి కూడ యిర్మీయా ఈ అలంకారాన్నే వాడాడు (యిర్మీయా 20:9). అతడు దేవుని వాక్యాన్ని ప్రకటించకూడదని తలంచినా, అది తన వల్ల కాకుండపోయింది. అగ్ని అనేది దేవుని కోపముతో కూడ సంబంధం కలిగియున్నట్టు చెప్పబడింది (2 రాజులు 1:10–14). అగ్ని జ్వాలలయొక్క తీవ్రత, అగ్ని యొక్క దహించు స్వభావము యెరూషలేము బాధ యొక్క తీవ్రతను సూచిస్తుంది.

తన పాదములను చిక్కుపరచుటకై దేవుడు వలనొగ్గియున్నట్టు ఆమె భావించింది. ఓటమిని సూచించడానికి ఉపయోగించే అలంకారాల్లో యిది యొకటి. క్రూరమైన అడవి జంతువులను యిలా వలనొగ్గి పట్టి నిస్సహాయ స్థితిలో వశపరచుకొనడం జరుగుతుంది. భూమిమీద వలనొగ్గి అది కన్పించకుండ మన్నుగాని ఆకులుగాని పరుస్తారు. అందులో జంతువు కాలుపెట్టిన తోడనే, వల మూసికొనిపోయి ఉచ్చు బిగించుకొని, అది వలలో చిక్కుకుంటుంది.

"నన్ను వెనుకకు త్రిప్పియున్నాడు," "నన్ను పాడుచేసియున్నాడు," "దినమెల్ల నన్ను సొమ్మసిల్లజేసియున్నాడు" అనే ప్రయోగాలు ఆ పట్టణం యొక్క నిరీక్షణలేని స్థితిని యింకను తెలియజేస్తున్నాయి. తాను నమ్ముకోగల ఒక్కడేయైయున్న దేవుడు తాను నేడు భరించుతున్న కాడిని కట్టియున్నాడు (1:14). ఆయనే స్వయంగా ఆ కాడిని ఆమె మెడమీద పెట్టి యున్నాడు. భారమైన బరువులు లాగడానికి కాడి ఉద్దేశింపబడింది. కన్యకయైన యూదా కుమారి లాగుతున్న బరువువలన తన బలము క్షీణించిపోయింది. అది తాను మోయగల దానికంటె అధికమయ్యింది. తన బలము తగ్గిపోయినందున, తన్ను బాధించేవారిని సహింపలేకపోతుంది.

తన భద్రతా విధానం ఆమె సేన – బలిష్ఠులు, యౌవనులైనవారు – పాదాల క్రింద త్రొక్కబడుతున్నారు ద్రాక్షల గానుగలో వేసి త్రొక్కినట్టు అణచబడుతున్నారు (1:15). యెరూషలేము వీధులలో రక్తం ఒలికించబడునంతగా జరిగినదాన్ని ఈ చిత్రం తేటగా చూపుతుంది.

ఈ సంభవాలు తన్ను విలపించేలా చేశాయి. ఆమె కన్నులు కన్నీటితో పొర్లుతున్నాయి. ఆమె జనులు నాశనం చేయబడ్డారు. ఎందుకంటే, శత్రువులు ఆమెను అణచారు, ఆదరించువాడు (దేవుడు) వారికి దూరమయ్యాడు. ఈ విలపించు స్త్రీని గూర్చి యింకా దుఃఖించే ప్రత్యేకమైన విశేషముంది. యూదా యొక్క చింతను వర్ణించడానికి యిర్మీయా ఆ పోలికను ఉపయోగించాడు. విలపించు స్త్రీయే దయను రేకెత్తించకపోతే, దాదాపు మరేదియు అలా చేయలేకపోవచ్చు. "యూదా యొక్క గాఢమైన దుఃఖాన్ని బట్టి, దేవా కనికరించుము" అని యిర్మీయా అంటున్నాడు.

## ఆమె ప్రార్థనలను బట్టి

దేవుడు యెరూషలేముపై కనికరము కలిగియుంటానికి మరో కారణం, దాని ప్రార్థనలు, "సీయోను తన చేతులను చాపుచున్నది" (1:17ఎ). "సీయోను" అనేది యెరూషలేముకును ఆ పరిశుద్ధ పట్టణము చుట్టునున్న ప్రదేశానికి మరొక పేరు. గాఢమైన దుఃఖములో ఉండి ప్రార్థించే సాధారణమైన విధానము–తన దేవుని యెదుట చేతులు చాపుటగా చెప్పబడుతుంది. కనానీయులతో యూదావారు మిశ్రిత వివాహాలు చేసికొనిన సంగతి వినిన ఎజ్రా చేసింది దీనికి ఉదాహరణగా ఉంది. అతడు ఆశ్చర్యపడి సాయంకాలపు బలియర్పణ సమయంవరకు కూర్చుండి, తన మోకాళ్ల మీద పడి, తన చేతులు దేవుని వైపు చాపాడు (ఎజ్రా 9:15).

తీవ్రమైన ప్రార్థనతో యూదా తన చేతులు చాపినను, తన్ను ఆదరించువారు ఎవరును లేకపోయారు. తన చుట్టునుండు దేశములవారు తనకు విరోధులగునట్టు దేవుడు తీర్మానించాడు. యెరూషలేము వారి మధ్య అపవిత్రురాలయ్యింది. అది అసహ్యత పుట్టించి తొలిగిపోయేలా చేసింది.

తన చేతులు చాపుటవలన – దేవుని చేరుటకు ప్రయత్నించడంవలన – "కనికరము గల దేవా, కన్యకయైన యూదా కుమారి ప్రార్థన ఆలకించుము" అని యెరూషలేము మొర్రపెట్టినట్టుంది. తనపై వచ్చిన దేవుని తీర్పులు నీతిగలవని అది ప్రార్థనాపూర్వకంగా అంగీకరించింది (1:18ఎ). తన తిరుగుబాటును తాను గుర్తించింది (1:18బి). యెరూషలేము మీదికి వచ్చిన విపత్తుల నిమిత్తం గతంలో యెరూషలేము దేవుని నిందించినట్టుంది. "యెహోవా తన ప్రచండ కోపముతో తనకు శ్రమ కలిగించి"నట్టు తలంచింది (1:12); తన పాదములను చిక్కించుకొనడానికి ఆయన వలనొగ్గియున్నట్టు భావించింది (1:13); "కాడికట్టినట్లుగా తానే నా అపరాధములను నాకు కట్టియున్నాడు, అవి పైన వేయబడినవై నా మెడమీదికెక్కెను" అని అన్నది (1:14); ఆయన తన్ను "ద్రాక్షగానుగలో వేసి త్రొక్కియున్నాడు" అని చెప్పింది (1:15).

నిజంగా, యూదా మీదికి దేవుడైన యెహోవా ఆ విపత్తులన్నియు తెచ్చింది, తన

పాపముపైని తీర్పుగానే. ఆయన తీర్పులు న్యాయములును, సత్యములునైయున్నాయి. వాస్తవంగా, తన పాపముల ఫలితాన్ని తాను తన మీదికి తెచ్చుకుంది. దేవుని ఆజ్ఞలకు విరోధంగా తాను తిరుగుబాటు చేసిన సంగతి తనకు తెలుసు. సంభవించిన ప్రతిదానికి తాను పాత్రురాలన్న విషయం తాను ఎరుగును.

తన దుఃఖాన్ని తిలకించుడని ప్రజలందరితో అది చెప్పుకొంటుంది. దాని యౌవనస్థులు చెరగొని పోబడ్డారు. తన గత విటకాండ్రు సహాయం చేయలేనివారై యున్నారు. యిర్మీయా మాటలు వినడానికి నిరాకరించిన యాజకులు, పెద్దలు, మత నాయకులు ఆకలితో చచ్చారు. తాను ఏవైపు తిరగడానికైనా తనకంటూ ఎవరే లేరు (1:19).

అందువలన తన వేదనను చూడుమని అది దేవుని వేడుకొంది (1:20). తాను పాపము చేసినట్టు గుర్తించి, తన హృదయాన్ని మార్చుకొంది. తన ఆత్మ వేదనలో మునిగియుంది. శత్రు ఖడ్గముచేత చంపబడేలా వెలుపట భయము కలుగుతుంది. లోపల నెమ్మది లేకుండా ఉంది. ముట్టడివలన కలిగిన ఆకలి బాధ, వ్యాధితో మరణం అటునుండి కూడ వెంటాడుతుంది యిర్మీయా 15:2; 18:21లో వలె "మరణ"మనేది "తెగులును" కూడ సూచిస్తుంది.[1] క్షేమముగాను, నెమ్మదిగాను ఉండడానికి కన్యకయైన యూదా కుమారికి చోటే లేకపోయింది. మరణం వీధులలో నేమి యిండ్లలో కూడా తొంగి చూస్తుంది.

## దేవుని వాగ్దానమును బట్టి

మరొక హేతువును బట్టి దేవుడు కనికరిస్తాడని యెరూషలేము నమ్మింది. యూదా కంటెను ఎక్కువ దుష్టత్వంతో నిండిన దేశమును, యూదాను శిక్షించడానికి వినియోగించడాన్ని గూర్చి ముందుగా యిర్మీయా దేవుని నీతిని ప్రశ్నించాడు (యిర్మీయా 12:1-4). ఆ దేశములు మారుమనస్సు పొందనట్టయితే, వాటి సంగతి కూడ తేల్చుకుంటానని దేవుడు వాగ్దానం చేశాడు (యిర్మీయా 12:14-17).

దేవుని ప్రతీకారపు వాగ్దానం నెరవేర్చబడడానికి యూదా, యెరూషలేముతో పాటు యిర్మీయా కూడ సిద్ధంగా ఉన్నాడు. తన సొంత కాలములో దేవుడు ప్రతి పరిస్థితిని చక్కపరచుకొంటాడు.

---

## సందేశమేమి?

పాపము యొక్క భారమును నీవు అనుభవించుతున్నావా లేక తప్పు చేసినందుకు కఠినమైన పర్యవసానాలను అనుభవిస్తున్నావా? నీ దుఃఖము నిరీక్షణలేనిదైయుండదు.

(1) *క్రీస్తునందు, దుఃఖమునందు ఆదరణ దొరుకుతుంది.* "దుఃఖపడువారు ధన్యులు, వారు ఓదార్చబడుదురు"రని ప్రభువైన యేసు తెలిపారు (మత్తయి 5:4). ఈ సందర్భంలో, ఏదో విపత్తు మీద పడినందున వచ్చిన దుఃఖము కాక, పాపము చేసినందుకు దుఃఖపడేవారిని గూర్చి క్రీస్తు పలికారు. ఏదియెలాగున్నా, పాపము యొక్క ఫలితంగా ఏ విపత్తయినా వచ్చినట్టయితే, పాపమును బట్టియు, పరిస్థితిని బట్టియు విలపించినప్పుడు, ఆ రెండింటికి గాని లేక ఏ ఒక్కదానికైనా మనకు క్రీస్తునందు ఆదరణ లభిస్తుంది.

పాపంవలన వచ్చిందేగాని కాకపోనీ, విపత్తుకు దేవుడు ఆదరణను ప్రసాదిస్తాడు. యోబు జీవితంలో జరిగినట్టు, తుఫానుగుండా మనలను బలీయమైన ప్రజలనుగా తెచ్చి, మన బాధకు, దుఃఖానికి దేవుడు అర్థాన్ని యివ్వగలడు. బాధలు మన శక్తిని పోగొట్టి నిస్సహాయులనుగాను, మనలో మనకే నిరీక్షణ లేనివారుగాను చేయబడినప్పుడు, దేవుని వద్దనుండి పొందే శక్తి మనకున్న శక్తికంటె మనలను ఎక్కువ బలవంతులుగా నిలబెడుతుంది. అందుకే, "నేనెప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడ"నని పౌలు చెప్పగలిగాడు (2 కొరింథీ. 12:10). అతడు బహుగా బలహీనుడైయుండినప్పుడు, దేవుని మహా గొప్ప శక్తిచేత బ్రతికింపబడుతున్నాడు.

పాపమునకై దుఃఖపడడంలో క్రీస్తు ఆదరణను వాగ్దానం చేశారు. పౌలు యిలా బోధిస్తున్నాడు: "దైవచిత్తానుసారమైన దుఃఖము రక్షణార్థమైన మారుమనస్సును కలుగజేయును. అయితే లోకసంబంధమైన దుఃఖము మరణమును కలుగజేయును" (2 కొరింథీ. 7:10). మన పాప స్థితిని గూర్చి దుఃఖపడడానికి ప్రతిఫలంగా మారుమనస్సు కలుగుతుంది. మారుమనస్సు పాపక్షమాపణను కలిగిస్తుంది. పాపభారముక్రింద పడి సతమతమౌతున్నవానికి క్షమాపణ పొందడంకంటె ఎక్కువైన ఆదరణ ఏదీ ఉండదు.

నా చిన్నతనంలో ప్రతి పిల్లవాడు తీగ మీద ఆరవేసిన బట్టలు తగిలించే ప్లాస్టిక్ లేదా కొయ్యతో చేయబడిన క్లిప్పువంటిదాన్ని ఆట వస్తువుగా విసిరివేస్తూ పట్టుకుంటూ ఉండేవాడు. ఆ క్లిప్పును తీసికోవద్దని మాయమ్మ నాకు చెప్పకముందు మాయింటిలోని ఆ క్లిప్పులను కొన్ని పాడుచేశాను, విసిరివేసే ఆటలో కొన్ని పోగొట్టాను. ఒక ఆదివారాన మేము మా ఆంటి యింటికి వెళ్లాం. బట్టలు ఆరవేసుకునే తీగమీద నాకు అందుబాటులో ఆ క్లిప్పు ఒకటి ఉంది. నేను దాన్ని తీసికొని నా జేబులో వేసికొన్నా. ఆ రాత్రి యింటికి వచ్చాము. అయితే నా బట్టలు వాషింగ్ మెషిన్‌లో వేయకముందు, మాయమ్మ నా జేబులను చెక్ చేసింది. అప్పుడు ఆమెకు ఆ క్లిప్పు కన్పించింది.

ఆమె నా దగ్గరకు వచ్చి అది నీకు ఎక్కడిది అని అడిగింది, నాకది దొరికింది అని నేను బదులిచ్చాను. దాన్ని గూర్చి మాయమ్మ నన్ను ఎక్కువగా ప్రశ్నించి, మా ఆంటి బట్టలు ఆరవేసికొనే తీగమీద నేను దాన్ని "కనుగొన్న" సంగతి తెలిసికొన్నప్పుడు, నేను దొంగిలించానని మాయమ్మ నాతో అన్నది.

అందుకు నేను ఎదురు చూచినట్టు అమ్మ నన్ను కొట్టలేదు. "వచ్చేవారం మనం ఆంటి యింటికి వెళ్లినప్పుడు అది ఆమెకు యిచ్చి, దాన్ని దొంగిలించినందుకు ఆమెను క్షమాపణ కోరమని" అమ్మ నాకు చెప్పింది. మాయమ్మ నన్ను కొట్టేదానికంటే అది నన్ను ఎక్కువగా బాధించింది. ఆ రాత్రి నేను నిద్రపోలేనంతగా ఏడ్చాను. మరుసటి ఉదయం లేచాను, నా తప్పు యొక్క భారాన్ని నా హృదయం మోస్తునే ఉంది. నేను దాన్ని ఆ వారమంతా భరించాను. నేను తప్పు చేశానని మా ఆంటికి ఎలా చెప్పబోతానో మాటిమాటికి రిహార్స్ చేసికొన్నాను.

ఆదివారం మధ్యాహ్నం, మా ఆంటి యింటికి వెళ్లినప్పుడు, నేను లోపలికి వెళ్ల తలచుకోలేదు. నేను మా అమ్మ వెనుక నిలబడ్డాను, ఏమీ చెప్పలేదు. మాట్లాడడానికి నేను నోరు తెరచిన వెంటనే నేను ఏడుస్తానని నాకు తెలుసు.

చివరిగా, మా ఆంటితో "J. L. నీతో ఒక మాట చెప్పాలనుకుంటున్నాడు" అని అమ్మ చెప్పింది. మా ఆంటి చిరునగవుతో, "అది ఏంటి J. L.?" అని అడిగింది. ఏదో నేనొక మంచి మాట చెప్పుతానని ఆమె ఎదురు చూస్తున్నట్టు నాకు తెలిసిపోయింది. నేను ఆమె (బట్టలు తగిలించుకునే) క్లిప్పు తీసికొని వెళ్లానని చెప్పడానికి నాకు సిగ్గుగా ఉంది. ఆ క్లిప్పు ఆమెకు అంత అవసరమా, పోగొట్టుకుంటేనేమని నేను ఆశ్చర్యపోయాను. నేను ఏడ్వసాగాను. మా ఆంటి నన్ను తన చేతుల్లోనికి తీసికొని, "అంత చెడ్డదైన సంగతి ఏంటి?" అని అడిగింది.

నెమ్మదిగా, నా జేబులోనుండి ఆ క్లిప్పును తీసి ఆమె చేతికి యిచ్చాను. అప్పటికి నేను ఆమెతో ఏ మాట చెప్పలేదు. అయితే ఈ వ్యథ దాటిపోవాలని నేను కోరుకున్నా, గనుక, "నీ క్లిప్పు తీసికొన్నందుకు నేను చింతిస్తున్నాను" అని ఎట్టకేలకు అన్నాను.

మా ఆంటి నన్ను గట్టిగా కౌగలించుకొంది. "ఫరవాలేదు. నాకు చాలా ఉన్నాయి. నీవు నన్ను అడిగియుండినట్టయితే, నేనే దాన్ని నీకు యిచ్చియుండేదాన్నే. నీవు దాన్ని ఉంచుకో" అని ఆమె అన్నది.

ఆహా! ఎంతటి విడుదల! ఆ వారమంతా నేను మోసికొన్న భారమంతా ఒక్క మాటతో తొలిగిపోయింది. వెంటనే నేను తిరిగి సంతోషించాను. పాపాన్ని ఒప్పుకొని క్షమాపణ పొందితే వచ్చే ఆదరణ అలాటిది. దైవచిత్తానుసారమైన దుఃఖము క్షమాపణ పొందుదుమను నిరీక్షణతో కూడినదై, దుఃఖాన్ని చిరునగవుగా మార్చుతుంది, దుఃఖము సంతోషముతో మిళితమైయుంటుంది.

(2) *దోషాన్ని దుఃఖభారాన్ని పోగొట్టుకునే సమయం యిదే.* చివరిగా దేవుడే మంచి ఆశ్రయమైతే, ఆయన మొదట మంచి ఆశ్రయమైయుంటాడు. యూదా జనులవలె, మన సమస్యను మనమే పరిష్కరించుకోవలెనని చూస్తాం. పూర్తి నిరాశ ఎదురైనప్పుడే దేవునివైపు మరలడం జరుగుతుంది. దేవుని వైద్యునివలె మనం ఉపయోగించుకో గోరతాం. వైద్యుని దగ్గరకు వెళ్లడానికి ఎవరే యిష్టపడరు. డాక్టరును చూడడం ఎంతవరకు నెట్టివేయాలో మనం అంతవరకు నెట్టివేస్తాం. మొదట మన సొంత వైద్యం చేసికొంటాం. మనలను మనమే బాగుచేసికోగలుగుతామని రోగాన్ని ముదిరిపోయేలా చేస్తాం. చివరికి, డాక్టరు దగ్గరకు వెళ్లకుంటే చేయగలిగింది మరేది లేదనే స్థితికి చేరుకుంటాం.

నాశనం వచ్చిన తరువాతనే–పరిస్థితి నిరీక్షణలేని స్థితికి దిగజారినప్పుడు మాత్రమే – యెరూషలేము దేవునివైపుకు తిరిగి, ఆయన సహాయాన్ని కోరనారంభించింది. తాము బబులోనుకు ఎంతగా భయపడ్డారో అంతగా భయపడిన తమ స్నేహితులైన ఐగుప్తీయులు, ఎదోమీయులు, యింకను యితరులవైపు యూదా జనులు తిరిగారు. తమకు తప్పుడు సందేశమిచ్చిన అబద్ధ ప్రవక్తల మాటలు వారు విన్నారు. దేవుళ్లు కాని దేవతా విగ్రహాలను వారు ఆశ్రయించారు. ఇవన్నీ సహాయం చేయలేకపోయినప్పుడు వారు దేవుని వైపు తిరిగారు.

మనం కూడ ఎందుకు అలా ప్రవర్తిస్తాం? మన అక్కరలతో దేవుని ఎందుకు తొందరపెట్టాలి? అని మనం తలంచినందుకా? మన సమస్తం మనమే చూచుకోవాలి, కేవలం పెద్ద సంగతులను మాత్రమే దేవునికి అప్పగించాలని తలంచినందుకా? మన

కారణాలు ఏవైయున్నా, దేవునియందు మనకు నమ్మకం లేని స్థితిని అవి ప్రదర్శిస్తున్నాయి. నమ్మకం లేకపోవడమంటే, దేవుడు మనకు సరిగా తెలియనివాడనే అర్థమిస్తుంది. ఆయనను మనం నిజంగా ఎరిగియుంటే, దేవుడు చేయలేని గొప్ప కార్యమేదీ లేదు సరిగదా, ఆయన గమనించని చిన్న సంగతి కూడ ఏదీ ఉండదు అని ఎరుగుతాం.

దేవుడు ఏమంటున్నాడో విను:

> దేనినిగూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనములచేత కృతజ్ఞతాపూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి. అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసుక్రీస్తువలన మీ హృదయములకును మీ తలంపులకును కావలియుండును (ఫిలిప్పీ. 4:6-8).

> ఎడతెగక ప్రార్థనచేయుడి (1 థెస్స. 5:17).

> దేవుడు తగిన సమయమందు మిమ్మును హెచ్చించునట్లు ఆయన బలిష్ఠమైన చేతి క్రింద దీనమనస్కులై యుండుడి. ఆయన మిమ్మునుగూర్చి చింతించుచున్నాడు గనుక మీ చింత యావత్తు ఆయనమీద వేయుడి (1 పేతురు 5:6, 7).

> ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులార, నాయొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును, నేను సాత్వికుడను దీనమనస్సు గలవాడను గనుక మీమీద నా కాడి ఎత్తికొని నాయొద్ద నేర్చుకొనుడి; అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరుకును ఏలయనగా నా కాడి సుళువుగాను నా భారము తేలికగాను ఉన్నవి (మత్తయి 11:28-30).

నీవు వీటిని విన్నావా? ప్రతిదాన్ని గూర్చి ప్రార్థించు! ప్రార్థన అన్నివేళల చేయి! నీ జీవితపు ప్రతి విషయంలోనికి దేవుని తీసికొని రా. ఆయన లేకుండ నీయింటిని వదలడానికి సాహసించకు. నీవు వెళ్లే ప్రతి చోటికి ఆయనను తోడుపెట్టుకొని వెళ్లు. ఆయన నిన్ను గూర్చి చింతిస్తాడు! జీవితంలోని చిన్న అక్కరలను గూర్చి నీవు దేవునితో మాట్లాడ నిరాకరించినట్టయితే, పెద్ద అక్కరలను గూర్చి ఆయనతో మాట్లాడుకునే హక్కును నీవు కోల్పోవచ్చు. మోసికొని పోడానికి ఆయన నీకు సహాయపడతాడు గనుక లోకము యొక్క భారముకంటె దేవుడు మనపై మోపిన భారాన్ని మోయడం సులభం.

(3) *నీ పాప భారాన్ని ప్రభువైన యేసు మోయగోరుతున్నారు.* పాపభారమనేది భరించవలసిందే. ఇది జీవిత చట్టం. మన త్రోవ తప్పిన తనాన్ని దేవుడు గమనింపక మానడు. మనం దోషం చేసినప్పుడు, ఆయన తల త్రిప్పుకొని దాన్ని చూడకుండలేదు.

> మోసపోకుడి దేవుడు వెక్కిరింపబడడు; మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును. ఏలాగనగా తన శరీరేచ్ఛలనుబట్టి విత్తువాడు తన శరీరమునుండి క్షయమను పంట కోయును, ఆత్మను బట్టి విత్తువాడు ఆత్మనుండి నిత్య జీవమను పంట కోయును (గలతీ. 6:7, 8).

జీవిత నియమానికి వారేదో మినహాయింపు అన్నట్టు దేవుని ప్రజలు తలంచి పొరపాటుచేశారు. వారు దేవునిచే ఏర్పరచుకొనబడినవారు, నిక్కమైన ద్రాక్షా వనమై

యున్నారు. వారు చెడిపోయిన స్థితిని దేవుడు చూడకుండునని తలంచ వచ్చునా? మనకు యిష్టము వచ్చినట్టు చేసి, పర్యవసానాన్ని తప్పించుకుంటామని మనం ఆలోచించేలా శోధింపబడుతున్నామా? “నీ పాపము నిన్ను పట్టుకొనును ...” బహు కాలము క్రిందట మోషే ఇశ్రాయేలీయులను హెచ్చరించాడు (సంఖ్యా. 32:23).

వారు ఎంతగా త్రోవతప్పిపోయారో, దాని పర్యవసానం కూడ అంతే తీవ్రంగా ఉండిపోయింది. చాలా కాలంగా యూదా త్రోవనుండి తొలిగిపోయి ఉంది; దాని జనులు అనేక పర్యాయములు హెచ్చరించబడ్డారు మారుమనస్సు పొంది దేవుని యొద్దకు తిరుగుడని వారు బోధింపబడినప్పుడు, తిరగడానికి బదులు వారు మరెక్కువగ విగ్రహాలు చేసికొని, వారి అవిధేయతకు వచ్చే పర్యవసానాన్ని అవి తప్పించగలవని వారు తలంచారు. ఎక్కువగా పాపం చేయబూనుకొనడం గత పాపాన్ని మరిపించలేదు. యూదా జనులు తమ పాపాన్ని ఎంత పెద్ద కుప్పగా చేసికొన్నారంటే, దాని పర్యవసానాన్ని వారు అనుభవించవలసినప్పుడు అది భరించలేనిదిగా ఉండిపోయింది.

దేవుడు తన్ను క్షమించలేనంత ఘోరమైన పాపం చేశానని చెప్పిన ఒకనితో నేను క్రీస్తును గూర్చి మాట్లాడాను. దేవుడంటే ఎవరో అతనికి తెలియదు. అతని పాపాలు అతడు భరించగలవాటికంటె అధికమే కావచ్చు, కాని దేవుడు వాటిని భరించగలిగిన వాటికంటె అధికమైనవి కావు. కల్వరి సిలువపై ప్రభువైన యేసు అనుభవించిన వేదన బాధ యొక్క తీవ్రత, దారినుండి తొలిగిపోయిన మానవ జాతి యొక్క పాపపు తీవ్రతకు సరితూగుతుంది. దేవుడు వాటిని చూడకుండ పోయాడుగాని, పాపము యొక్క వెలలేని ఆ రుణాన్ని మనం తీర్చలేమన్న విషయాన్ని ఆయన ఎరుగును.

మానవ జాతి యొక్క ఆ భయంకరమైన పాప రుణాన్ని చెల్లించడానికిగాను క్రీస్తు అంతటి కఠోరమైన మరణాన్ని అనుభవించవలసివచ్చింది. దాన్ని మనం భరించలేము గనుక దాన్ని ఆయన మనకొరకు భరించారు. క్రీస్తువారు జన్మించడానికి ఎంతో ముందుగా ఈ విషయాన్ని యెషయా ప్రవచించాడు:

> నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను మన వ్యసనములను వహించెను అయినను మొత్తబడినవానిగాను దేవునివలన బాధింపబడినవానిగాను శ్రమనొందినవానిగాను మనమతనిని ఎంచితిమి. మన యతిక్రమక్రియలనుబట్టి అతడు గాయ పరచబడెను మన దోషములనుబట్టి నలుగగొట్టబడెను మన సమాధానార్థమైన శిక్ష అతనిమీద పడెను. అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది. మన మందరము త్రోవ తప్పిపోతిమి మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలిగెను యెహోవా మన యందరి దోషమును అతనిమీద మోపెను (యెషయా 53:4-6).

సిలువపై, క్రీస్తు నీ, నా పాపములకు పరిష్కారం ఏర్పాటుచేశాడు. సిలువపై, ఆయన మన రోగములను భరించెను మన వ్యసనములను వహించెను. రోమా 5:20లో పౌలు యిలా అన్నాడు: “పాపమెక్కడ విస్తరించెనో అక్కడ కృప అపరిమితముగా విస్తరించెను.” యూదా జనులు దేవుని కనికరము కొరకు వేడుకున్నారు. మనకు కూడ దేవుని కృప అందుబాటులో ఉంది. కృప అనేది కనికరమును మించి ఒక అడుగు ముందుకు వేసింది.

ఒకడు న్యాయంగా అనుభవించవలసిన శిక్షను నిలిపివేస్తుంది. కృపయైతే పాప రుణాన్నే చెల్లిస్తుంది, గనుక మనం ఆ రుణం చెల్లించవలసిన అవరసత ఉండదు. క్రీస్తు ప్రభువు లేకుండ మన పాపములు మనము భరింపజాలనివి.

మన నమ్మిక ఆయనయందుంచాలి. పాపము యొక్క నిత్య పర్యవసానాలనుండి ఆయన మాత్రమే మనలను రక్షించగలడు. మన పాపపు దోషాన్ని ఆయన మాత్రమే తొలిగించగలడు. గనుక ఆ భారమైన దోషాన్ని మనం భరించనవసరముండదు. బాగా ప్రేమించబడిన పాట యిలా అంటుంది.

> నా పాపమును కడుగగలిగినదేది?
> యేసు రక్తము గాక ఏదీ లేదు;
> నన్ను తిరిగి శుద్ధీకరించగలదేది?
> యేసు రక్తము గాక ఏదీ లేదు.[2]

కడుగబడడానికి దేవుడు మనలను క్రీస్తునొద్దకు పిలుస్తున్నాడు. ఎందుకంటె పాపము యొక్క శాపాన్ని భరించింది ఆయనే. ఆయనయందు విశ్వసించాలని, నమ్మిక ఉంచాలని, మన జీవితాలు ఆయనకు సమర్పించాలని, ఆయన మనకు పిలుపునిస్తున్నాడు (యోహాను 5:24). మారుమనస్సు పొందడానికి మనం సంసిద్ధంగా ఉంటాం (అపొ. 3:19), మనం జీవించే గత విధానాన్ని మార్చుకుంటాం, యేసునందు మనం విశ్వసించినట్టు లోకానికి చెప్పుకొంటాం (అపొ. 8:37; రోమా 10:9, 10). అంటే దానికి అర్థం – ఆయన మరణ, సమాధి, పునరుత్థానాల్లో పాలు పొందడానికి నీటియందు ముంచబడి, క్రీస్తునందలి నూతన జీవము పొంది నడుచుకొనడానికి బాప్తిస్మమనే నీటి సమాధినుండి లేపబడతామని (రోమా 6:3, 4). "మీరు విలువపెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి" అని పౌలు అందుకే కొరింథీయులకు చెప్పాడు (1 కొరింథీ. 6:20).

దేవుడు నిన్ను ఏమి కావాలని కోరుకుంటున్నాడో అన్ని విషయములలో నీవు అలాగే కావాలని కోరుచున్నావా? లోకపు పోకడను విడిచి, దేవుడు తన విధానాన్ని మన జీవితాలలో జరిగించేలా ఆయనకు అప్పగించుకొందాం. ఒక చేతితో లోకాన్ని మరో చేతితో దేవుని పట్టుకుంటే, అది నిన్ను చీల్చివేస్తుంది. ఎవరో ఒకరికి నిన్ను నీవు యిచ్చుకోవాలి.

> … చెడ్డదాని నసహ్యించుకొని మంచిదానిని హత్తుకొని యుండుము (రోమా 12:9).

---

సూచనలు

[1]R. K. Harrison, *Jeremiah and Lamentations,* The Tyndale Old Testament Commentaries, gen. ed. D. J. Wiseman (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1975), 212. [2]"Nothing But the Blood," *Songs of the Church,* ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishers, 1977).